
కాశిమేడు రేవుపై కమ్ముకున్న కారుమబ్బులు

### నగరంలో...

రాజధాని నగరం చెన్నైలో రెండు రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వేకువ జాము వరకూ నగరంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. కోడంబాక్కం, నుంగంబాక్కం, చెట్‌పట్, పురుషవాక్కం, చూళై మేడు, వెస్ట్‌మాంబళం, టీనగర్, తాంబరం, పల్లావరం, గిండి, పోరూరు, కోయంబేడు, వడపళని, మధురవాయల్, విరుగంబాక్కం, వలసరవాక్కం, రాయపేట, రాయపురం, వాషర్‌మెన్‌పేట, తిరువొత్తియూరు, ఆవడి, అంబత్తూరు తదితర ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం పెరుంగళత్తూరు, ఊరపాక్కం, వండలూరు, మరై మలైనగర్, గూడువాంజేరి, మహాబలిపురం, తిరుక్కుళికుండ్రం, అచ్చర పాక్కం, సెయ్యూరు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఈ వర్షాల కారణంగా నగరమంతటా వాతావరణం చల్లబడి ప్రజానీకం ఊరటచెందింది.

# రెడ్ ఆరెంజ్ అలెర్ట్

**● డెల్టా జిల్లాలను ముంచెత్తిన అకాలవర్షం**

**నగరంలో జడివాన ● 19 జిల్లాలకు నేడు భారీ వర్ష సూచన**


ఎగ్మూరులో వర్షంలో గొడుగుపట్టుకుని స్కూటర్‌పై వెళుతున్న నగరవాసులు


చేపాక్‌లో గొడుగుపట్టుకుని వెళుతున్న విద్యార్థినులు

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం డెల్టా జిల్లాలను ముంచెత్తింది. తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాలు, డెల్టా జిల్లాల్లో గురువారం వేకువజామున కుండపోత వర్షానికి ప్రజలు ఊరట చెందారు. తిరునల్వేలి జిల్లాల్లో బుధవారం రెండు గంటలపాటు చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. తిరునల్వేలి జంక్షన్, టవున్, సమాధానపురం, కేటీనగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. తెన్‌కాశి, సెంగోట, ఆయక్కుడ పరిసర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. తంజావూరు, పట్టుకోట, అదిరామపట్టినం, మదుకరూరు, తిరువేణం, పేరావూర్ని, తిరువారూరు, తిరుత్తురైపూండి, మన్నార్‌గుడి, నాగపట్టినం, వేదారణ్యం, మైలాడుదురై, సీర్గాళి తదితర ప్రాంతాల్లో గురువారం వేకువజామున భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఈ ప్రాంతాల్లోని జలాశయాలు, జలపాతాలు జలకళను సంతరించుకున్నారు. రామేశ్వరం, పరిసర ప్రాంతాల్లోనూ పెనుగాలులతో వర్షం కురిసింది. మదురై పెరియార్ బస్‌స్టేషన్, సింహక్కల్, గోరిపాళయం, పుతూరు, ఒత్తకడై, తిరుప్పరంకుండ్రం, అవనియాపురం తదితర ప్రాంతాల్లోనూ చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. సేలం ఆత్తూరు, నత్తకర్రై, శంకగిరి, కరియకోవిల్, కెంగవల్లి, మేట్టూరు, తమ్మంబట్టి తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. కోయంబత్తూరు జిల్లా కొండాముత్తూరు, కెంపనూరు గ్రామంలో పెనుగాలులతో కురిసిన భారీ వర్షానికి మూడు శతాబ్దాల నాటి జమ్మి వృక్షం కూలిపడింది.

**నేడు భారీ వర్షాలు...**

నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక సముద్రతీర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలోని 19 జిల్లాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరించింది. కోయంబత్తూరు, తేని, నీలగిరి, దిండుగల్, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాలకు గురువారం రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ ఏడు జిల్లాల్లో కుండపోత, ఓ మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రెడ్‌అలెర్ట్ ప్రకారం గురువారం అర్ధరాత్రి వరకూ ఈ ఏడు జిల్లాల్లో పలు చోట్ల 21 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు కూడా వాతావరణం కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే విధంగా తూత్తుకుడి, విరుదునగర్, మదురై, తిరుప్పూరు, ఈరోడ్ జిల్లాల్లోనూ చెదురుముదురుగా వర్షాలు కురుస్తాయని చెప్పారు. సముద్రతీర జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీల వేగంతో గాలులు వీస్తాయన్నారు. రామనాథపురం, శివగంగ, పుదుకోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, కడలూరు, సేలం, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు, నామక్కల్, కరూరు, తిరుచ్చి, కారైక్కాల్ జిల్లాల్లో పలుచోట్ల భారీగా వర్షాలు కురుస్తాయన్నారు.


ఎగ్మూరు వద్ద వానలో తడుస్తూ వెళుతున్న వ్యక్తులు

### విద్యుదాఘాతానికి ఐదుగురి మృతి...

నామక్కల్, విల్లుపురం, చెన్నై, సేలం తదితర ప్రాంతాల్లో అకాల వర్షం కారణంగా విద్యుదాఘాతానికి గురై ఐదుగురు మరణించారు. సేలం జిల్లా అమ్మపేట్టకు చెందిన అర్ధనారీ అనే వ్యక్తి కుమారుడు దండపాణితో కలిసి తన దుకాణం నేమ్‌బోర్డ్ మార్చేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో నేమ్‌బోర్డు విద్యుత్ స్తంభాన్ని తాకటంతో అప్పటికే వర్షపునీటితో తడిసిన స్తంభంలో విద్యుత్ ప్రసారమవటంతో ఇద్దరూ విద్యుదాఘాతానికి గురవగా దండపాణి మృతి చెందాడు. ఇక చెన్నై క్రోంపేటలో భవన నిర్మాణ పనులు చేస్తున్న ఆనంద్, విల్లుపురం జిల్లా దేవనూరులో మేస్త్రి జ్యోతి కరెంట్‌షాక్‌తో ప్రాణాలు కోల్పోయారు. నామక్కల్ జిల్లా కుమారపాళయంలో విద్యుదాఘాతానికి గురై భార్యాభర్తలు మృతి చెందారు.


గ్రానైట్ లోడు లారీ, రవాణా సంస్థ బస్సు మధ్యలో ధ్వంసమైన ఆమ్నీ బస్సు

# ఘోర రోడ్డు ప్రమాదం

**● మధురాంతకం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు**

**● డాక్టర్ సహా నలుగురి మృతి ● 20 మందికి గాయాలు**

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మధురాంతంకంలో తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారిపై గురువారం వేకువజాము సంభవించిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ సహా నలుగురు మృతి చెందగా, 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. విల్లుపురం నుంచి పూందమల్లికి గ్రానైట్ రాళ్లలోడుతో బయలుదేరిన లారీ మధురాంతకం రోడ్డులో వెళ్తూ మరమ్మతుల కారణంగా ఆగిపోయింది. ఆ సమయంలో తిరుచ్చి నుంచి నగరానికి వస్తున్న ఆమ్నీ బస్సు అదుపుతప్పి లారీ వెనుకవైపు ఢీకొట్టింది. దీంతో ఆమ్నీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఆమ్నీ బస్సులో ప్రయాణించిన తిరుచ్చి అపోలో ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న రాజేష్ (30), చెన్నై కొడుంగయూరుకు చెందిన ధనలక్ష్మి (53), చెన్నైకి చెందిన ప్రవీణ్‌కుమార్, ఓ మహిళ మృతి చెందారు. ఈ ప్రమాదం జరిగిన కొన్ని నిముషాల్లోనే ముసిరి ప్రాంతం నుంచి నగరానికి వస్తున్న రాష్ట్ర రవాణా సంస్థ బస్సు అదుపుతప్పి ఆమ్నీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో రవాణా సంస్థ బస్సులో ప్రయాణించిన 20 మందికి గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన వెళ్ళిబస్సు శిథిలాల నుంచి గాయపడినవారిని వెలికి తీసి చికిత్స నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారిలో గంటకు పైగా వాహనాల రాకపోకలు స్తంభించాయి.

# పుదుచ్చేరిలో 'అల'జడి


పుదుచ్చేరి బీచ్‌లో సందర్శకులను హెచ్చరించి పంపుతున్న పోలీసులు

పుదుచ్చేరి, మే 16 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సముద్రతీర ప్రాంతాల్లో గురువారం వేకువజామున అలల తాకిడి అధికమైంది. వేకువజాము నుంచి పుదుచ్చేరి అంతటా ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. దీనికి తోడు సముద్రతీరంలో అలలు తీరం వైపు ఎగసిపడ్డాయి. అలలు సుమారు 6 నుంచి 7 అడుగుల ఎత్తున తీరం వైపు దూసుకువచ్చాయి. అలల ఉధృతి అధికం కావటంతో పోలీసులు మైకుల్లో హెచ్చరిస్తూ సముద్రతీరం పొడవునా ఉన్న స్థానికులను పంపించివేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ పుదుచ్చేరి అంతటా చిరుజల్లులు పడటంతో వాతావరణం చల్లబడింది. ఉదయం ఆరుగంటల నుంచి పెనుగాలులతో వర్షం కురిసింది. ఈ అకాలవర్షానికి వారం రోజులుగా ఎండవేడికి అలమటించిన ప్రజలు ఊరట చెందారు. వర్షం కారణంగా నీటరాజప్పర్ వీధిలో ఓ చెట్టు కూలిపడగా, అగ్నిమాపక దళం హుటాహుటిన దానిని తొలగించారు.


బ్లూ టౌన్ బస్సులు

# కోవైలో జీపీఎస్‌తో బ్లూ టౌన్ బస్సులు

ప్యారీస్, మే 16: కోవై ప్రభుత్వ రవాణా సంస్థ అదనపు సీట్లు, జీపీఎస్ సదుపాయంతో డిజైన్ చేసిన నీలిరంగు టౌన్ బస్సులను పరిచయం చేసింది. ఈ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని అధికారులు తెలిపారు. ప్రభుత్వ రవాణా శాఖలో చెన్నై, విల్లుపురం, సేలం, కోవై, కుంభకోణం, మదురై, తిరునల్వేలి తదితర 8 మండలాల్లో 7,614 ఆర్డినరీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. రవాణా శాఖ తరఫున 20,127 బస్సులు నడుపుతున్నారు. 8 రవాణా మండలాల్లో పాత బస్సులు తొలగించి కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నారు. రాజధాని నగరంలో ఎంటీసీ సంస్థ మహిళల కోసం పింక్ బస్సులు నడుపుతున్న విధంగా, కోవైలో జీపీఎస్‌తో నీలిరంగు టౌన్ బస్సులను ఆధునిక వసతులతో డిజైన్ చేశారు. తొలివిడతగా ఆరు బస్సులను గురువారం ఉదయం కోవై గాంధీపురం బస్‌స్టేషన్‌లో అధికారులు పరిచయం చేశారు.

# 'కావేరీ సమావేశాల్లో' అధికారులు

**● ప్రకటించిన ప్రభుత్వం**

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): కావేరీ జలాల నిర్వాహక మండలి సమావేశాల్లో అధికారులు పాల్గొంటున్నారని, ఆ సమావేశాల్లో రాష్ట్రం తరఫున వాదనలు వినిపిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కావేరీ జలాల నిర్వాహక మండలి సమావేశంలో అధికారులు పాల్గొనకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది. కావేరీ నిర్వాహక మండలి సమావేశం ఎప్పుడు జరిగినా రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు ప్రత్యక్షంగానూ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటున్నారని, తద్వారా రాష్ట్ర అవసరాల గురించి, హక్కుల గురించి మండలి ముందు బలమైన వాదనలు వినిపిస్తున్నారని పేర్కొంది. కావేరీ నిర్వాహక మండలి 94వ సమావేశం మార్చి 21న పుదుచ్చేరిలో జరగ్గా, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారని గుర్తు చేసింది. కావేరీ మండలి సమావేశాల్లో పాల్గొనేందుకు అధికారులకు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులివ్వడంతో పాటు తగిన ఏర్పాట్లు కూడా చేస్తోందని వివరించింది. అయితే మండలి సమావేశాల్లో అధికారులు పాల్గొనకుండా రాష్ట్ర ప్రభుత్వమే అడ్డుకుంటోందంటూ ఓ పత్రిక చేసిన ఆరోపణ అవాస్తవమని, ఇలా వక్రీకరించి వార్తలు ప్రచురించడం సబబు కాదని ప్రభుత్వం హితవు పలికింది.

# డ్రగ్స్ స్మగ్లర్లపై ఉక్కుపాదం

**పోలీసులకు సీఎం స్టాలిన్ ఆదేశం**

ప్యారీస్, మే 16: రాష్ట్రంలోని డ్రగ్స్ స్మగ్లర్లను ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసు ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. సచివాలయంలో గురువారం ఉదయం సీఎం స్టాలిన్ అధ్యక్షతన రాష్ట్రంలో మాదకద్రవ్యాల నివారణకు చర్యలు, అవగాహన తదితర అంశాలపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఈ మూడేళ్ల డీఎంకే ప్రభుత్వంలో మాదకద్రవ్యాల విక్రయాలు గణనీయంగా పెరిగాయని ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలకు తగ్గట్టుగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో గంజాయి, మత్తు బిళ్లలు తదితర మాదకద్రవ్యాలను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఈ చర్యలకు పాల్పడిన వారిని అరెస్ట్ చేస్తున్నారు. మరోవైపు మత్తు మందుకు బానిసలైన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని సోషల్ మీడియాలో ప్రత్యేక కథనాలు వస్తున్నాయి. రాష్ట్రంలో నిషేధించిన గుట్కా, పాన్‌పరాగ్ తదితర పొగాకు పదార్థాలు కూడా భారీస్థాయిలో పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ రకంగా మాదకద్రవ్యాల చెలామణిని పూర్తిస్థాయిలో అడ్డుకొని, దానికి బాధ్యులైన సంఘవిద్రోహులపై కఠిన చర్యలు చేపట్టే అంశంపై సీఎం స్టాలిన్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. కొంతమంది పోలీసు అధికారులు పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో మాదకద్రవ్యాల నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి, కొకైన్ తదితర మాదకద్రవ్యాల విక్రయాలకు సంబంధించి సమాచారం తెలిపేందుకు 9498111191 అనే వాట్సాప్ నెంబర్ కూడా విడుదల చేశామని, సమాచారం అందించే ప్రజల వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని అధికారులు తెలిపారు. అంతేకాకుండా, పోలీసు శాఖ ఫేస్‌బుక్, ట్విట్టర్ పేజీల వ్యవహార శైలి గురించి సీఎంకు వివరించారు. మాదకద్రవ్యాల కేసులో పట్టుబడిన వారి ఆస్తులు జప్తుచేయడంతో పాటు వారి బ్యాంక్ ఖాతాలు కూడా స్తంభింపజేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఈ సమావేశంలో సీఎం స్టాలిన్ పోలీసు ఉన్నతాధికారులకు కొన్ని సూచనలిచ్చారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏ రూపంలో కనిపించినా వాటిన వెంటనే నివారించాలని ఆదేశించారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులు తమ ప్రాంతంలో ప్రతి రోజూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న సంఘవిద్రోహులు, మాదకద్రవ్యాల కేసులో జైలు నుంచి విడుదలైన వారు, పేరుమోసిన రౌడీలు, చిన్న మొత్తంలో గంజాయి, గుట్కా విక్రయిస్తున్న వ్యాపారుల కదిలికలపై నిఘా వేయాలని, ఈ వివరాలను ఎస్పీ, కలెక్టర్ కార్యాలయాలకు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, సీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి మురుగానందం, హోం శాఖ కార్యదర్శి అముద, రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్, నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ సహా పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

# పళనిలో వైకాశి విశాఖ ఉత్సవాలు ప్రారంభం

ప్యారీస్, మే 16: దిండుగల్ జిల్లా పళని దివ్యక్షేత్రంలో వైకాశి విశాఖ ఉత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వళ్లీ, దేవసేన సమేత ముత్తుకుమారస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22వ తేదీ రథోత్సవం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. పళని క్షేత్రంలో జరిగే ఉత్సవాల్లో వైకాశి విశాఖం ప్రసిద్ధి. పదిరోజుల పాటు భారీస్థాయిలో జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు గురువారం పెరియనాయకి అమ్మవారి ఆలయంలో శివాచార్యులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిశూలం, కోడిపుంజు, నెమలి ఆకారాలతో రూపొందించిన పసుపు రంగు పతాకానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభంపై శుభ లగ్నంలో ఎగురవేశారు. పదిరోజుల ఉత్సవాల్లో వళ్లీ దేవసేన సమేత ముత్తుకుమారస్వామిని మాడవీధుల్లో బంగారు నెమలి, దంతాల పల్లకీ, కామధేను, మేకపోతు, వెండి ఏనుగు, వెండి నెమలి తదితర వాహనాల్లో ఊరేగించనున్నారు. ప్రధాన అంశమైన తిరుకల్యాణం ఈ నెల 21వ తేది సాయంత్రం 6 గంటలకు, 22వ తేది వైకాశి విశాఖ రథోత్సవం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ సారి ఉత్సవాల్లో జానపద కళాకారుల నృత్యం, మహిళల కోలాటం, భక్తిగీతాల ఆలాపన ఉంటాయని ఆలయ జాయింట్ కమిషనర్ మారిముత్తు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో వళ్లీ,దేవసేన సమేత ముత్తుకుమారస్వామి


ధ్వజ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శివాచార్యులు

## సమాచార దర్శిని

### వైద్య పోస్టులకు దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, మే 16: ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు సహా 2,533 పోస్టులను వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు (ఎమ్మార్బీ) భర్తీ చేయనుంది. ఈ పోస్టుల దరఖాస్తు స్వీకరణ గత నెల 23వ తేది ప్రారంభమై ఈ నెల 15తో ముగిసింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు సమర్పణ గడువు జూలై 15వ తేది వరకు పొడిగించినట్లు, అర్హులైన వారు www.mrb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఎమ్మార్బీ ఒక ప్రకటనలో తెలిపింది.

### విశాఖ - ఎగ్మూర్ మధ్య ప్రత్యే రైళ్లు

పెరంబూర్, మే 16: వేసవి సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం- ఎగ్మూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.08577 విశాఖపట్నం- ఎగ్మూర్ సమ్మర్ స్పెషల్ రైలు ఈనెల 27, జూన్ 3,10,17,24 తేదీల్లో విశాఖలో సాయంత్రం 5.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.45 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.08578 ఎగ్మూర్-విశాఖ సమ్మర్ స్పెషల్ రైలు ఈ నెల 28, జూన్ 4,11,18,25 తేదీల్లో ఎగ్మూర్‌లో ఉదయం 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు అర్ధరాత్రి ఒంటి గంటలకు విశాఖ చేరుతుంది.

### 20 నుంచి చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, మే 16: చదురగిరి ఆలయానికి ఈ నెల 20 నుంచి ఐదు రోజులు అనుమతించనున్నట్లు అటవీ శాఖ తెలియజేసింది. విరుదునగర్ జిల్లా ఒత్తిరాయిప్పు సమీపంలోని పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో వెలసిన చదురగిరి సుందర, చందన మహాలింగం ఆలయానికి ప్రతినెలా అమావాస్య, పౌర్ణమి రోజుల్లో భక్తులను అనుమతిస్తుంటారు. ఈ నేపథ్యంలో, వైకాశి నెల ప్రదోషం, పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 20 నుంచి 24వ తేది వరకు భక్తులను అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

### నేపాల్‌కు ఆధ్యాత్మిక పర్యాటక రైలు

పెరంబూర్, మే 16: రాష్ట్రం నుంచి తొలిసారిగా నేపాల్ ముక్తినాథ్‌కు ఆధ్యాతిక పర్యటనకు 'ఏసీ' రైలు ఏర్పాటైంది. జూన్ 6న మదురై నుంచి బయల్దేరే రైలు తిరుచ్చి, విల్లుపురం, చెన్నై ఎగ్మూర్ మీదుగా గోరఖ్‌పూర్ వెళ్లనుంది. అక్కడి నుంచి 'ఏసీ' డీలక్స్ బస్సులో నేపాల్, పసుపతినాథ్, ముక్తినాథ్, అయోధ్య తదితర ఆలయాలు చూడవచ్చు. శాఖాహార భోజనం, రవాణా ఛార్జీలు, బసతో కలిపి నాన్ ఏసీ ప్రయాణానికి ఒకరికి రూ.45,900, 3 టైర్ ఏసీ రూ.54,900, సెకండ్ క్లాస్ ఏసీ ప్రయాణానికి రూ.59.950 ఛార్జీగా నిర్ణయించారు. వివరాలకు 7305858585 అనే నెంబరు సంప్రదించవచ్చు.

### మూడు రోజుల్లో కొత్త విద్యుత్ కనెక్షన్లు

పెరంబూర్, మే 16: కొత్తగా విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రాంతాల్లో విద్యుత్ మార్గం లేకపోతే 90 రోజులు, విద్యుత్ స్తంభాలు లేకపోతే 60 రోజుల్లో కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో, విద్యుత్ స్తంభాలు, పిల్లర్ బాక్సులు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న 3 నుంచి 7 రోజుల్లో కొత్త విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రధాన ఇంజనీర్లకు విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది.

### కల్లనై కాలువ క్లీనింగ్

ఐసిఎఫ్, మే 16: తంజావూరు జిల్లా కల్లనై కాలువను శుభ్రం చేస్తున్నారు. కల్లనై నుంచి పుదుకోట జిల్లా ముంపాలై వరకు 149 కి.మీ ఉన్న కల్లనై కాలువ కింద 2.50 లక్షల ఎకరాల భూములు సాగవుతున్నాయి. ఈ కాలువ తీరంలో నివసించే ప్రజలు చెత్తు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తూ కాలువను డంపింగ్ యార్డుగా మార్చారు. తంజావూరు కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు 690 మంది పారిశుద్య కార్మికులు చెత్తకుప్పలను యంత్రాలు, వాహనాలతో తొలగిస్తున్నారు. వారం రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, మే 16: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పట్టాభిరామ్ పరిధిలోని తండురై, అయ్యప్పన్‌నగర్, సేక్కాడు, గోపాలపురం ఈస్ట్, వెస్ట్, తెంద్రల్ నగర్, అన్నానగర్, ముల్లైనగర్, సౌత్ బజార్, వల్లలార్ నగర్, వెంకటాపురం, సీటీహెచ్ రోడ్డు, ఛార్లెస్ నగర్, డ్రైవర్స్ కాలనీ, మోడ్రన్ సిటీ, కామరాజపురం, శాస్త్రినగర్, ఐఏఎఫ్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

### ప్రభుత్వ పాఠశాలల గోడలపై కుడ్యచిత్రాలు

ఐసిఎఫ్, మే 16: రాష్ట్రంలోని 6,130 ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల తరగతి గదుల్లో విద్యార్థులను ఆకట్టుకొనేలా కుడ్రచిత్రాలు వేసే పనులను త్వరలో పూర్తి చేయాలని ప్రాథమిక విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ప్రాథమిక విద్యా డైరెక్టరేట్ ఆధ్వర్యంలో అన్ని జిల్లా విద్యాధికారులకు పంపిన ఉత్తర్వుల్లో.. 2023-24 విద్యా సంవత్సరం పాఠశాలల అభివృద్ధికి కేటాయించిన నిధులతో తరగతి గదుల గోడలపె పెయింటింగ్ వేయించాలని ఆదేశించారు. ఈ పనులు పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు ముగించాలని పేర్కొన్నారు.

### ఎగ్మూర్ స్టేషన్‌లో టిక్కెట్ కౌంటర్ మార్పు

ఐసిఎఫ్, మే 16: స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో టిక్కెట్ కౌంటర్‌ను తాత్కాలికంగా వేరే చోటుకు మార్చారు. ఈ రైల్వేస్టేషన్ రూ.734.91 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనుల కారణంగా ఎగ్మూర్ నార్త్ ప్రాంతంలో పాత భవనంలో పనిచేస్తున్న సబర్బన్ రైలు టిక్కెట్ కౌంటర్లు తాత్కాలికంగా మరోచోటుకు మార్చారు. ఎగ్మూర్ పూందమల్లి హైరోడ్డును ఆనుకొని ఉన్న మణియమ్మై విగ్రహం సమీపంలో ఉన్న రైల్వే భద్రతా దళం కార్యాలయాన్ని ఆనుకొని ఈ టిక్కెట్ కౌంటర్లు గురువారం నుంచి పనిచేస్తున్నాయి.

### ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్లకు 1.50లక్షల దరఖాస్తులు

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ ఇంజనీరింగ్ కోర్సులలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. బీఈ, బీటెక్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారడు. అన్నా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీల అడ్మిషన్ల వ్యవహారాలు నిర్వహిస్తుంది. ఈ ప్రక్రియ గత ఆరో తేదీ ప్రారంభమైంది. ప్లస్-2 ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఇంజనీరింగ్ కాలేజీలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశం కోసం 1.50 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తులు చేసినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు జూన్ ఆరున ముగియనుంది.

# బ్రయాంట్ పార్క్‌లో నేటినుంచి పుష్ప ప్రదర్శన




ఐసిఎఫ్, మే 16: దిండుగల్ జిల్లా కొడైకెనాల్ బ్రయాంట్ పార్క్‌లో ఈ ఏడాది పుష్ప ప్రదర్శన శుక్రవారం ప్రారంభమై 26వ తేది వరకు పదిరోజులు జరుగనుంది. సాధారణంగా ఈ ప్రదర్శన రెండు రోజులు మాత్రమే జరుగుతుంటుంది. ఈ ఏడాది పదిరోజుల పాటు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం పార్క్‌లో నాటిన పూలమొక్కలు వికసించి కనువిందు చేస్తున్నాయి. లక్ష కార్నేశన్ పుష్పాలతో నిప్పు కోడి, కోడిపుంజు, నెమలి వంటి వివిధ ఆకృతులు రూపొందించారు. 25 వేల పూలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నారు. పర్యాటకులను ఆకట్టుకొనేలా పార్క్ కార్యాలయం సమీపంలో 'ఐ లవ్ కోడై' అని సాల్వియా పూలతో సెల్ఫీ పాయింట్ ఏర్పాటుచేశారు. ఈ ఎగ్జిబిషన్‌తో పాటు వేసవి ఉత్సవాలు కూడా నిర్వహించనుండడంతో పోలీసు భద్రత కూడా ఏర్పాటుచేశారు. పర్యాటకుల కోసం 360 టనల్ అనే రీల్స్ వీడియో చిత్రీకరణకు కొత్త పరికరం ఏర్పాటుచేశారు. ఈ పరికరంలో నిల్చొని తమ సెల్‌ఫోన్ కెమెరా ద్వారా 360 డిగ్రీలు తిరిగి వీడియో తీసుకోవచ్చు. దీని ద్వారా చుట్టుపక్కల ఉన్న పూలమొక్కలను కవర్ చేయడానికి వీలవుతుందని అధికారులు తెలిపారు.

### తిరువణ్ణామలైకు టాయిలెట్‌తో కూడిన సబర్బన్ రైలు

పెరంబూర్, మే 16: ఈ నెల 2వ తేది నుంచి 19 ఏళ్ల తర్వాత చెన్నై బీచ్ నుంచి తిరువణ్ణామలైకు సబర్బన్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. చెన్నై బీచ్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయల్దేరే రైలు అర్ధరాత్రి 12.05 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో తిరువణ్ణామలై నుంచి తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి ఉదయం 9.45 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో, చెన్నై బీచ్ నుంచి తిరువణ్ణామలైకి ఆరు గంటల ప్రయాణం కావడంతో వృద్ధులు, పిల్లలు టాయిలెట్‌కు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారని ప్రయాణికులు దక్షిణ రైల్వేకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రైల్వే ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ... చెన్నై బీచ్-తిరువణ్ణామలై సబర్బన్ రైలులో టాయిలెట్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారని, ప్రస్తుతం ఐసీఎఫ్‌లో టాయిలెట్‌తో కూడిన సబర్బన్ రైలు బోగీల తయారవుతున్నాయని, త్వరలో ఈ మార్గంలో టాయిలెట్‌తో కూడిన సబర్బన్ రైళ్లు నడుపుతామని ఆయన తెలిపారు.

### డెల్టాలో 26 ఇసుక క్వారీలు

ఐసిఎఫ్, మే 16: డెల్టా జిల్లాల్లో 26 ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ప్రారంభించేందుకు జలవనరుల శాఖ నిర్ణయించింది. అన్నాడీఎంకే ప్రభుత్వంలో ఇసుక క్వారీలకు బదులుగా ఎం-శాండ్ విక్రయాలకు ప్రాధాన్యత ఇచ్చారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన అనంతరం తిరుచ్చి, కరూర్, తంజావూరు, తిరువళ్లూర్ సహా వివిధ జిల్లాల్లో 30కు పైగా ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ప్రారంభించారు. అయితే నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు తనిఖీలు నిర్వహించి ఆ క్వారీలు మూసివేశారు. ఈ నేపథ్యంలో, డెల్టా జిల్లాల్లో 26 ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ప్రారంభించేందుకు నిర్ణయించిన జలవనరుల శాఖ, పర్యావరణ శాఖ అనుమతి కోరింది. అనుమతి లభించగానే క్వారీలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

### కాళికాంబాల్ ఆలయ అర్చకుడు సస్పెన్షన్

ప్యారీస్, మే 16: స్థానిక ప్యారీస్‌లోని కాళికాంబాల్ ఆలయంలో దర్శనం కోసం వచ్చిన భక్తురాలిని లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యవహారంలో ఆలయ అర్చకుడు కార్తీక్‌మునుస్వామిపై సస్పెన్షన్ వేటుపడింది. కాళికాంబాల్ ఆలయానికి నగరం, శివారు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. సాలిగ్రామానికి చెందిన ఓ మహిళ కొన్ని రోజుల క్రితం దర్శనం కోసం ఈ ఆలయానికి వెళ్లగా, అర్చకుడు కార్తీక్‌మునుస్వామి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఆర్కే నగర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో మునుస్వామిని సస్పెండ్ చేస్తూ ఆలయ యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది.

### శ్రీలంక నౌకాయానం మళ్లీ వాయిదా

ప్యారీస్, మే 16: నాగపట్టణం నుంచి శ్రీలంక నౌకాయానం మళ్లీ వాయిదాపడింది. నాగపట్టణం నుంచి శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు గత ఏడాది అక్టోబరు 14వ తేది నుంచి ప్రయాణికుల నౌకాయానం ప్రారంభమైంది. కేరళ రాష్ట్రం కొచ్చిన్ నుంచి 'సెరిపాని' అనే పేరుతో ప్రయాణికుల నౌకా సేవలు ప్రారంభించారు. అనంతరం ఈశాన్య రుతుపవనాల కారణంగా అక్టోబరు 23వ తేది నుంచి నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, ఈ సేవలు మళ్లీ అందుబాటులోకి రానున్నాయని వార్తలు వెలువడ్డాయి. తిరుచ్చి కేంద్రంగా పనిచేస్తున్న శుభం గ్రూప్ ఆఫ్ కంపెనీ, ఇంట్ శ్రీ బే సర్వీస్ సంస్థల సంయుక్తంగా సోమవారం నుంచి 'శివగంగై' ప్రయాణికుల నౌక సేవలు ప్రారంభమవుతున్నట్లు, అందుకోసం ఆదివారం నాగపట్టణం-కాంగేశన్ మధ్య నౌక ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, నాగపట్టణానికి నౌక రాకలో జాప్యం జరగడంతో నౌకా సేవలు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుయని ప్రకటించారు.. అయితే న్యాయ శాఖకు సంబంధించి కొన్ని అనుమతులు రావడంలో జాప్యం ఏర్పడింది. అందువల్ల ఈ నెల 19 నుంచి నౌకాయాన సేవలు ప్రారంభమవుతాయని, ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ఆ రోజుకు మార్చుకోవాలని, వద్దనుకొనే వారు రుసుము వాపసు తీసుకోవాలని అధికారులు తెలిపారు.

### కుట్రాలం జలపాతంలో స్నానాలకు నిషేధం



పెరంబూర్, మే 16: పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఆహ్లాదకర వాతావరణం సంతరించుకోవడంతో కుట్రాలంకు సందర్శకులు అధికంగా వస్తున్నారు. ఈ నేపథ్యంలో, కుట్రాలం ప్రధాన జలపాతంలో నీటి ప్రవాహం పెరిగింది. అలాగే, తెన్‌కాశి జిల్లాకు భారీ వర్షసూచన ప్రకటించిన నేపథ్యంలో, కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద సందర్శకుల స్నానాలకు నిషేధం విధిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

### ఎన్‌సీఈటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా హరికృష్ణ



చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టులో 'నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్' (ఎన్‌సీటీఈ) స్టాండింగ్ కౌన్సిల్‌గా తెలుగు ప్రముఖుడు, సీనియర్ న్యాయవాది జక్కుల హరికృష్ణ నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన ఏడాది పాటు కొనసాగనున్నారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలకు, సంస్థలకు జీపీగా, స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవరించిన హరికృష్ణ పలు కీలక కేసుల్లో విజయం సాధించారు. ఆయన పలు తెలుగు సంస్థల్లోనూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

### చోళుల కాలం నాటి శిలాఫలకాలు లభ్యం



లభ్యమైన శిలాఫలకాలు

వేలూరు, మే 16: వల్లిమలై సమీపంలో చోళుల కాలం నాటి రెండు శిలాఫలకాలు లభ్యమయ్యాయి. ఇవి క్రీ.పూ 10వ శతాబ్దం ఇరాట్టిరకుడ రాజు మూడో కృష్ణన్, ఇరాట్టికకూడ రాజు కన్నర దేవన్ శిలాఫలకాలుగా గుర్తించారు. ఈ శిలాఫలకాల్లో తమళం, కన్నడ భాషల్లో ఒకే విషయం లిఖించబడి ఉంది. కేంద్ర పురావస్తు శాఖ శిలాఫలకాల విభాగం డైరెక్టర్ మునిరత్నం సలహా మేరకు అసిస్టెంట్లు నాగరాజన్, అళగేశన్ ఈ శిలాఫలాకాలు కనుగొన్నారు. సమాచారం అందుకున్న వేలూరు ప్రభుత్వ మ్యూజియం అధికారి శరవణన్ వెళ్లి ఆ శిలాఫలకాలను మ్యూజియంకు తీసుకొచ్చారు.

### బాలమురుగన్ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం చేస్తున్న దృశ్యం

వేలూరు, మే 16: రత్నగిరి సమీపం కీల్‌మిన్నల్ గ్రామంలో ఉన్న బాలమురుగన్ ఆలయ వైకాశి విశాఖ బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం, అలంకారం, దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ స్థాపకుడు బాలమురుగన్ అడిమై స్వామి, కలవై సచ్చిదానంద స్వామి పాల్గొన్నారు. వేడుకలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

### రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న రాణిపేట ఎస్పీ కిరణ్ శృతి

వేలూరు, మే 16: రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేలా రాణిపేటలో ర్యాలీ చేపట్టారు. రాణిపేట సీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలో ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ కిరణ్ శృతి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎంసీ డైరెక్టర్ విక్రమ్ మెహదీవ్, సీఎంసీ ఆర్గనైజర్ డా.రాజేష్, మెడికల్ సూపరింటెండెంట్ దీపక్ సెల్వరాజ్, అసోసియేట్ డైరెక్టర్ డా.లాలు జోసఫ్, జాయింట్ డైరెక్టర్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### అకాలవర్షంతో ఉప్పు ఉత్పత్తికి ఇబ్బందులు



ఉప్పుపై టార్పాలిన్ కప్పుతున్న రైతులు

పెరంబూర్, మే 16: నాగపట్టణం జిల్లాలో ఎండ తీవ్రత కారణంగా ఉప్పు ఉత్పత్తి జోరుగా సాగుతోంది. మళ్ల నుంచి ఉప్పు సేకరించిన రైతులు ఆరుబయట ఎండబెడు తున్నారు. ఈ నేపథ్యంలో, అగస్తియన్‌పల్లి, కొడియకాడు. కడినల్‌వయల్ తదితర ప్రాంతాల్లో హఠాత్తుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, ఎండబెట్టిన ఉప్పును రాశులుగా పోసి, వర్షానికి తడవకుండా టార్పాలిన్‌తో కప్పుతున్నారు. వర్షాల కారణంగా మళ్లలో నీరు చేరడంతో ఉత్పత్తి నిలిపివేసామని, నీరు తగ్గిన వారం తర్వాత ఉప్పు ఉత్పత్తి చేపడతామని రైతులు తెలిపారు.

### 14 మంది లంక జాలర్ల అరెస్టు

పెరంబూర్, మే 16: సరిహద్దులు దాటిన 14 మంది శ్రీలంక జాలర్లను భారత కోస్ట్‌గార్డ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీపంలో దేశ సరిహద్దులు దాటి నాలుగు నాటుపడవల్లో ప్రవేశించిన 14 మంది జాలర్లను అరెస్ట్ చేసిన కోస్ట్ గార్డ్ సిబ్బంది, వారిని నాగపట్టణం హార్బర్‌కు తరలించారు. విచారణ నిమిత్తం వేదారణ్యం తీరప్రాంత భద్రతా దళానికి అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

# డ్రైవర్ బ్యాంక్ ఖాతాలో రూ.205 కోట్లు జమ

● ఫిర్యాదుపై కొనసాగుతున్న విచారణ

ప్యారీస్, మే 16: నగరంలో నెలకు రూ.15,000 జీతం అందుకుంటున్న తన బ్యాంక్ ఖాతాలో రూ.205 కోట్లు జమ అయినట్లు ఓ కారు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుపై కొన్నేళ్లుగా విచారణ కొనసాగుతోంది. శ్రీనివాసన్ అనే కారు డ్రైవర్‌కు 2016 సంవత్సరం ఆదాయపు పన్ను శాఖ అధికారులు బ్యాంక్ ఖాతా గురించి వివరణ కోరుతూ నోటీసు జారీచేశారు. అయితే తన పేరుతో ఎవరో బ్యాంక్‌లో నకిలీ ఖాతా ప్రారంభించారని, దీనిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరుతూ శ్రీనివాసన్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో శ్రీనివాసన్ ఫిర్యాదును కేంద్ర ఆర్థిక నేర విభాగం పోలీసులు నిరాకరించినట్లు తెలిసింది. దీనిపై శ్రీనివాసన్ మళ్లీ కోర్టును ఆశ్రయించగా, ఫిర్యాదుపై విచారణ జరపాలని కేంద్ర ఆర్థికనేర విభాగం పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. అవసరమైతే సీబీఐ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఈ కేసు బదిలీ చేయాల్సిందిగా న్యాయస్థానం సూచించింది. అయినప్పటికీ, ఈ కేసులో ఐటీ, ఇతర దర్యాప్తు సంస్థలు విచారణ సక్రమంగా నిర్వహించలేదని తెలిసింది. ఇదిలా ఉండగా 2014వ సంవత్సరం నగరంలో ఉన్న రెబెక్స్ ఎనర్జీ లిమిటెడ్ అనే సంస్థలో శ్రీనివాసన్ డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగంలో చేరిన సమయంలో శ్రీనివాసన్ నుంచి డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో వివరాలను ఆ సంస్థకు అప్పగించినట్లు తెలిసింది. అక్కడ నాలుగు రోజులు మాత్రమే పనిచేసిన శ్రీనివాసన్‌ను ఐదో రోజు ఉద్యోగం నుంచి ఆ సంస్థ తొలగించింది. ఈ నేపథ్యంలో, శ్రీనివాసన్ పేరుతో నకిలీ బ్యాంక్ ఖాతాను సృష్టించి రూ.205 కోట్లు జమచేసిన వారెవరన్న దానిపై విచారణ చేపట్టిన దర్యాప్తు సంస్థలకు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని చెప్పడం అనుమానాస్పదంగానే ఉంది.

## డ్రైనేజీ శుద్ధీకరణకు ఆధునిక యంత్రం



ఆధునిక యంత్రం

ప్యారీస్, మే 16: గ్రేటర్ చెన్నై ప్రాంతం 426 చ.కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉంది. దాదాపు 85 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నగరానికి ప్రతిరోజు సుమారు 15 లక్షల మందికిపైగా వివిధ పనుల కోసం వచ్చి వెళుతున్నారు. నగరంలో మెట్రోవాటర్ బోర్డు ఇళ్లు, పరిశ్రమలకు 9.30 లక్షల డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చింది. వీటి ద్వారా విడుదలవుతున్న కలుషిత నీటిని 13 శుద్ధీకరణ కేంద్రాలకు తరలించి 745 మిలియన్ లీటర్ల కలుషిత నీటిని శుద్ధి చేస్తున్నారు. ఈ డ్రైనేజీ సేవల కోసం 4 వేల కి.మీ పొడవున పైపులు అమర్చారు ఈ పైపుల్లో ప్రవహించే కలుషిత నీటితో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు చేరడంతో నీటి ప్రవాహం ఆగిపోతోంది. ఈ సమస్య పరిష్కరించేందుకు పదేళ్ల క్రితం వరకు కార్మికులను కాలువల్లో దించి పనిచేయించేవారు. దీనికి న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేయడంతో కార్మికులకు బదులుగా ఆధునిక యంత్రాలను వినియోగించాలని వాటర్ బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం మూడు 'బండికూట్' ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసిన మెట్రోవాటర్ బోర్డు, నగరంలో పలు ప్రాంతాల్లో ట్రయల్ రన్ చేపట్టింది. తిరువికనగర్, తేనాంపేట, అడయార్ ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ కాలువల్లో ఈ యంత్రం ద్వారా చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు తొలగిస్తోంది. ఈ పరికరంలో సెన్సార్ కెమెరాలు, విషవాయువు గుర్తించే తదితర అంశాలున్నాయి. ఇక నుంచి డ్రైనేజీలో దిగి విషవాయువు సోకి కార్మికులు మరణించడాన్ని బండికూట్ యంత్రం ద్వారా నియంత్రించవచ్చని, అంతేకాకుండా ఇంధనం ఖర్చు కూడా తగ్గుతుందని వాటర్ బోర్డు అధికారులు తెలిపారు.

# 75 ఏళ్లు దాటినా అంటరానితనం, వివక్షలా...!

● హైకోర్టు మదురై బెంచ్

పెరంబూర్, మే 16: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇంకా కొన్ని ప్రాంతాల్లో అంటరానితనం, వివక్ష చూపడం లాంటి ఘటనలు అంగీకరించలేమని, ఇలాంటి చర్యలను న్యాయస్థానం చూస్తూ ఊరుకోదని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ హెచ్చరించింది. దిండుగల్ జిల్లాకు చెందిన స్వామినాథన్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో.. దిండుగల్ జిల్లా వడచెందూర్ సమీపంలోని వెల్లబొమ్మన్ గ్రామంలోని భగవతి అమ్మవారు, ముత్తాలమ్మ, కాళియమ్మ, మారియమ్మన్ ఆలయాల్లో ఈ నెల 19వ తేది ఉత్సవాలు జరుగనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో, ఆ గ్రామంలో నివసిస్తున్న 80 దళిత కుటుంబాలకు ఆలయ వేడుకల్లో పాల్గొనేందుకు అనుమతించమని చెబుతున్నారని, ఈ వేడుకల్లో దళితులు కూడా పాల్గొనేలా అనుమతులివ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ గురువారం విచారించిన ధర్మాసనం... దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటినా ఇంకా కొన్ని ప్రాంతాల్లో అంటరానితనం, వివక్ష చూపడం లాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, ఇలాంటి వాటిని అంగీకరించేమని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు న్యాయస్థానాలున్నాయన్నారు. ఒక మనిషిని సాటి మనిషి వేరుగా చూడడం అంగీకరించలేమన్నారు. ఆలయ వేడుకల్లో ఎలాంటి వివక్ష లేకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని, అలాగే, వేడుకల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా రెవెన్యూ, పోలీసు శాఖలు పర్యవేక్షించాలని ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

### బాణసంచా పేలి ఒకరి మృతి

పెరంబూర్, మే 16: సేలం జిల్లాలో బాణసంచా పేలిన ఘటనలో ఒకరు మృతిచెందారు. కడంబూరు గ్రామంలోని ఓ ఇంట్లో బాణసంచా తయారుచేస్తున్న సమయంలో హఠాత్తుగా పేలుడు సంభవించడంతో రాజమాణిక్యం (44) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### పులియాంతోపులో బాలుడికి కుక్క కాటు

● ముగ్గురిపై కేసు నమోదు

ప్యారీస్, మే 16: స్థానిక పులియాంతోపులో ఆరేళ్ల బాలుడిని కుక్క కరిచిన సంఘటనలో కుక్కను పెంచుకుంటున్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. పులియాంతోపు కేపీ పిళ్లై పార్క్ హౌసింగ్ బోర్డు 14వ బ్లాక్‌లో నివసిస్తున్న అరుణ్‌కుమార్,తేన్‌మొళి దంపతుల ఆరేళ్ల కుమారుడు హరీష్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం ఆ ప్రాంతంలో చిన్నారులతో కలసి ఆడుకుంటున్న సమయంలో, పక్కింటి వారు వాకింగ్‌కు తీసుకెళ్లిన కుక్క కరిచింది. ఇందులో తీవ్రంగా గాయపడిన బాలుడికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు బేసిన్ బ్రిడ్జి పోలీసులు, కుక్కను పెంచుకుంటున్న స్టెల్లా, ఆమె కుమార్తె ప్రీత, మనవడు అరవింద్‌లపై కేసు నమోదుచేశారు.

### తిరువొత్తియూర్‌లో బాలకార్మికులకు విముక్తి



ప్యారీస్, మే 16: స్థానిక తిరువొత్తియూర్‌లోని నగల తయారీ కంపెనీలో పనిచేస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది బాలకార్మికులను అధికారులు విడిపించారు. తిరువొత్తియూర్ వాల్‌టాక్స్ రోడ్డులో ఉన్న నగల తయారీ కంపెనీలో పొరుగు రాష్ట్రాలకు చెందిన బాలకార్మికులు పనిచేస్తున్నట్లు కార్మికుల సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందింది. గురువారం ఉదయం ఆకస్మికతనిఖీలు చేపట్టిన అధికారులు, ఆ కంపెనీలో పనిచేసిన పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది చిన్నారులను విడిపించారు. 14 నుంచి 17 ఏళ్లలోపు చిన్నారులను రాయపురంలో ని ప్రభుత్వ పిల్లల సంరక్షణ కేంద్రానికి తరలించి నగల తయారీ కంపెనీ యజమాన్యంపై కేసు నమోదుచేశారు.

### ఆన్‌లైన్ రమ్మీకి వైద్యవిద్యార్థి బలి

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరుక్కుపేటలో ఆన్‌లైన్ రమ్మీలో లక్షలాది రూపాయలు పోగొట్టుకుని వైద్య విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొరుక్కుపేట జేజేనగర్ ప్రాంతంలో లారీ టింకరింగ్ పనులు చేసే మునుసామి కుమారుడు ధనుష్‌కుమార్ (23) ప్రైవేటు వైద్యకళాశాలలో ఫిజియోథెరపీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. యేడాదిపాటు అతను ఆన్‌లైన్ రమ్మీ ఆడుతూ డబ్బు పోగొట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ రమ్మీ ఆడేందుకు డబ్బు లేకపోవడంతో తండ్రిని అడిగాడు. ఏదో అవసరాల నిమిత్తం అడుగుతున్నాడని భావించిన మునుసామి తను కష్టపడి సంపాదించి తెచ్చిన నాలుగువేలు కుమారుడికి ఇచ్చారు. ఆ నాలుగు వేలతో ఆన్‌లైన్ రమ్మీ ఆడిన ధనుష్‌కుమార్ నగదు పూర్తిగా పోగొట్టుకున్నాడు. దీంతో దిగులు చెందిన అతడు తన గదిలోకి వెళ్ళి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్కే నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

### ఏనుగు దంతాలతో ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, మే 16: విరుదునగర్ జిల్లా రాజపాళయంలో సమీపం సేత్తూర్ ప్రాంతాల్లో కొందరు ఏనుగు దంతాలను విక్రయిస్తున్నట్లు దర్యాప్తు విభాగం పోలీసులకు సమాచారం అందింది. దీంతో, పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి, రూ.60 లక్షల విలువైన రెండు ఏనుగు దంతాలు స్వాధీనం చేసుకొని, గణపతి సుందరనాచ్చియార్‌పురం ప్రాంతానికి చెందిన రామ్‌అళగు, చెల్లయ్యలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

### దిండివనం సమీపంలో వ్యాన్ బోల్తా

● 15 మందికి గాయాలు

ప్యారీస్, మే 16: విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో సారం ప్రాంతంలో వ్యాన్ బోల్తాపడిన ప్రమాదంలో ఆరుగురు చిన్నారులు సహా 15 మందికి గాయాలయ్యాయి. శ్రీపెరుంబుదూర్‌లోని యోగా కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు పరమకుడికి చెందిన సుమారు 20 మంది ఓ వ్యానులో బుధవారం బయల్దేరారు. పరమకుడికి చెందిన కన్నన్ నడిపిన ఈ వ్యాన్ దిండివనం సమీపంలోని సారం ప్రాంతానికి చేరుకున్న సమయంలో వర్షం కురుస్తుండడంతో అదుపుతప్పి రోడ్డు మధ్యలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు చిన్నారులు, డ్రైవర్ సహా 15 మందికి గాయాలయ్యాయి. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో దిండివనం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

### రైలు ఢీకొని తల్లి, కుమార్తె మృతి

ప్యారీస్, మే 16: విరుదునగర్ జిల్లా శివకాశిలో గురువారం పట్టాలు దాటుతూ రైలు ఢీకొనడంతో తల్లి, కుమార్తె మరణించినట్లు ఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు. శివకాశి గాంధీ నగర్‌కు చెందిన తమిళ్‌సెల్వి (54), ధనలక్ష్మి (28) అనే తల్లీకూతుళ్లు శివకాశి ప్రాంతంలో రైలుపట్టాలు దాటుతుండగా, మదురై నుంచి సెంగోట్టై వైపు వేళ్లే రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించారు. దీనిపై శ్రీవిల్లిపుత్తూర్ రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాలు స్వాధీనం చేసుకొని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### 20 నుంచి చెన్నై ఐఐటీలో 'వరల్డ్ కల్చరల్ ఫెస్ట్'

పెరంబూర్, మే 16: స్థానిక అడయార్‌లోని చెన్నై ఐఐటీలో ఈ నెల 20 నుంచి అంతర్జాతీయ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. చెన్నై ఐఐటీ, స్పిక్ మేక్యే సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేది వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 250 మందికిపైగా కళాకారులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో చర్చా వేదికలు, పాట కచే రీలు, నాట్య ప్రదర్శనలు, జానపద కళారూపాలు సహా పలు కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలను 20వ తేది సాయంత్రం ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ప్రారంభించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే ఈ ప్రదర్శనల్లో ప్రజలు ఉచితంగా పాల్గొనవచ్చని చెన్నై ఐఐటీ డైరెక్టర్ వి.కామకోటి, డీన్ సత్యనారాయణన్ మీడియాకు వివరించారు.



అఖిలభారత రైల్వే కార్మిక సమ్మేళనం (ఏఐఆర్ఎఫ్) అధ్యక్షుడిగా ఐదోసారి ఎన్నికైన సందర్భంగా గురువారం తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఎన్.కన్నయ్యను అభినందిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

కడలూరు జిల్లా చిదంబరం సమీపంలో 'కుట్టి ఆండవర్' ఆలయం భక్తుల కోర్కెలు నెరవేర్చే దేవళంగా పేరొందింది. అత్యంత ప్రాచీనమైన ఈ ఆలయంలో వెలసిన రూపరహితుడైన కుట్టి ఆండవర్ (అయ్యనార్) ఓ ఆంగ్లేయ వ్యాపారికి దర్శనమిచ్చి అతడిని అనుగ్రహించడంతో కోట్లకు పడగెత్తేలా చేసినట్లు స్థలపురాణం. ఈ ఆలయానికి చేరువగా ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన ఓ రహదారి వంతెనతో కూడిన చెక్‌డ్యామ్‌కు ఓ వైపు సముద్రపునీరు, మరో వైపు మంచి నీరు ప్రవహిస్తూ సందర్శకులకు వింత గొలుపుతుంది. స్థానిక మత్స్యకారులంతా చేపలవేటకు బయలుదేరటానికి ముందు ఈ ఆలయంలోని కుట్టి ఆండవర్‌ను దర్శించుకుని వెళతారు. కుట్టి ఆండవర్‌ను మత్స్యకారులంతా తమ కులదైవంగానే భావించి ఆరాధిస్తున్నారు. ఇంతటి విశేషాలు సంతరించుకున్న కుట్టి ఆండవర్ ఆలయాన్ని ఆంగ్లేయ వ్యాపారి నిర్మించడం మరీ విశేషం. - ఆంధ్రజ్యోతి, చెన్నై

# మత్స్యకారుల ఆరాధ్యదైవం
# కులదైవారాధన ప్రత్యేకం

ఆధ్యాత్మికం

- ఆంగ్లేయ వ్యాపారిని అనుగ్రహించిన కుట్టి ఆండవర్
- గర్భాలయంలో ఈటెలు, కొడవళ్ళు



ఆలయం వద్ద ఏనుగు, గుర్రాల విగ్రహాలు





అయ్యనార్ రక్షకుడు సెంబరుప్పు ఆలయం - అయ్యనార్‌స్వామి

## స్థలపురాణం...

కడలూరు జిల్లా చిదంబరం సమీపంలో ఉంది తెర్కు (దక్షిణ) పిచ్చావరం. ఏపుగా పెరిగిన చెట్ల పచ్చదనంతో చిట్టడవిని తలపించేలా సముద్రతీరానికి చేరువగా ఉన్న ప్రాంతమిది. పిచ్చావరం సముద్రమార్గం గుండా నౌకలో ప్రయాణించి శ్రీలంక, బర్మా వంటి దేశాలతో ఆంగ్లేయులు వ్యాపారాలు చేసేవారు. ఓసారి ఫేస్‌ఫ్రాంకీ అనే ఆంగ్లేయ వ్యాపారి విదేశీ వాణిజ్యం కోసం సామగ్రితో ఓడలో శ్రీలంకకు బయలుదేరాడు. పిచ్చావరం సముద్రతీరాన్ని దాటుతుండగా తుఫాను తాకిడికి గురై ఆ నౌక నీటిలో మునగసాగింది. ఓడలోని సరకులు తాను సముద్రగర్భంలో మునగటం ఖాయమని భావించిన ఆ ఆంగ్లేయుడు ఏం చేయాలో తోచక థిల్లై నటరాజస్వామివారి ఆలయం ఉన్న చిదంబరం క్షేత్రం వైపు చేతులు పైకెత్తి 'కాపాడు స్వామీ! నా నౌక మునిగిపోతోంది. ఇక చావే గతి!' అంటూ శరణుజొచ్చాడు. ఆ సమయంలో గాఢాంధకారంగా ఉన్న ప్రాంతంలో ఓ వెలుగు పుట్టింది. దానిని చూసి ఆయన ఆశ్చర్యపోయారు. ఆ వెలుగు వచ్చిన దిశ వైపు చూడగా సన్నటి ఇసుక దారి కనిపించింది. ఆ ఆంగ్లేయ వ్యాపారి



కుట్టి ఆండవర్ ఆలయం

నౌక నుంచి కిందకు దిగి నడుస్తుండగా ఆయన ముందు వైపు చిరునవ్వు నవ్వుతూ ఓ అందమైన బాలుడు కనిపించాడు. ఆ బాలుడు 'మీ నౌకను నీట మునిగి పోకుండా కాపాడతాను. విదేశాలకు వెళ్ళి వ్యాపారం చేసుకోవచ్చు. అయితే వ్యాపారం పూర్తి చేసుకుని తిరిగొచ్చాక ఈ ప్రాంతంలో నా కోసం ఓ చిన్న గుడి కట్టాలి' అని ఆజ్ఞాపించాడు. వెంటనే ఆ ఆంగ్లేయ వ్యాపారి మునిగేందుకు సిద్ధంగా ఉన్న నౌకను కాపాడితే తప్పకుండా తిరుగు ప్రయాణంలో గుడి కట్టించిన తర్వాతే స్వదేశానికి వెళతాను' అంటూ ఆ బాలుడికి వాగ్దానం చేశాడు. మరుక్షణమే ఆ బాలుడు అదృశ్యమయ్యాడు. ఆంగ్లేయ వ్యాపారి ఆ బాలుడు ఎవరై ఉంటాడని ఆలోచిస్తుండగానే ముప్పావు శాతం వరకు నీటిలో మునిగిన ఆ నౌక ఉన్నట్టుండి మామూలు స్థితికి వచ్చింది. ఆంగ్లేయ వ్యాపారి దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఆ తర్వాత నౌకాయానం సాఫీగా జరిగింది. శ్రీలంకలో వ్యాపారం జరిగి రెట్టింపు లాభాలు వచ్చాయి. ఆంగ్లేయ వ్యాపారి సంతోషంతో గుడి కట్టేందుకు కావాల్సిన సామగ్రిని కొని, వాటిని తన నౌకలో ఎక్కించుకుని దక్షిణ పిచ్చావరం చేరుకున్నాడు. ఆ ఊరి ప్రజల వద్దకు వెళ్ళి, తన నౌకను కాపాడిన బాలుడి గురించి, గుడికట్టించమంటూ ఆదేశించటం గురించి వివరించాడు. ఊరివారందరూ బాలుడి రూపంలో వచ్చింది తమ గ్రామంలోని 'ఆకాశ శాస్తా'గా పిలువబడే అయ్యనార్ స్వామి అని, ఆ స్వామి వారే ఓడను నీట మునిగిపోకుండా కాపాడినట్లు తెలిపారు. ఆ స్వామివారి ఆజ్ఞానుసారం ఆలయాన్ని నిర్మిస్తే తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని, పైగా ఆలయ నిర్మాణానికి సహకరిస్తామని ఆ వ్యాపారికి స్థానికులు తెలిపారు. ఊరివారందరితో కలిసి ఆంగ్లేయ వర్తకుడు ఆలయాన్ని నిర్మించసాగారు. ఆ సమయంలో ఆయనకు కలలో అయ్యనార్ ప్రత్యక్షమై ఆ ఊరికి తానే కావలి దైవంగా ఉంటున్నానని, తనకు రక్షకుడిగా ఉంటున్న 'సెంబరుప్పు'కు కూడా ఓ సన్నిధి నిర్మించమన్నారు. తామిద్దరం రూపరహితులుగానే భక్తులను అనుగ్రహిస్తామని తెలిపారు. అయ్యనార్ ఆదేశానుసారమే ఆ ఆలయ



పూర్ణ, పుష్కళ సమేత అయ్యనార్‌స్వామి

నిర్మాణం పూర్తయ్యింది. ఆంగ్లేయ వ్యాపారికి బాలుడిగా దర్శనమిచ్చిన అయ్యనార్‌ను 'కుట్టి ఆండవర్' అంటూ భక్తులు పిలువసాగారు. అప్పటి నుంచి ఆ క్షేత్రం అయ్యనార్ దివ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆలయ నిర్మాణం పూర్తయ్యాక ఆంగ్లేయవ్యాపారి స్వదేశానికి బయలుదేరుతూ ఆకాశ శాస్తాను చేతులెత్తి మొక్కాడు. ఆ సమయంలో 'గుడి నిర్మాణ సామగ్రిలో మిగిలిన రాళ్ళను మీ




ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన రహదారితో కూడిన చెక్‌డ్యామ్

ఊరికి తీసుకెళ్ళండి' అంటూ అశరీరవాణి వినిపించింది. ఆకాశశాస్తా ఎందుకలా చెబుతున్నారో అర్థం కాక ఆంగ్లేయ వ్యాపారి దైవ వాక్కు ప్రకారం ఆ నల్ల రాళ్ళను ఎక్కించుకుని నౌకలో తన స్వదేశానికి చేరాడు. ఆంగ్లేయ వ్యాపారి స్వస్థలం చేరగానే నౌకలో ఉన్న ఆ రాళ్ళన్నీ బంగారు రాళ్లుగా మారాయి. ఆ బంగారు రాళ్లతో ఆంగ్లేయ వ్యాపారి అప్పట్లోనే కోట్లకు పడగెత్తాడు.

## ఆలయ విశేషాలు..

కుట్టి ఆండవర్ ఆలయంలోని గర్భాలయంలో నల్లరాతి గోడపై మూడు మేకులు మాత్రమే ఉంటాయి. వాటికే అన్ని రకాల పూజలు జరుపుతారు. ఆలయ ప్రాంగణంలో ప్రవేశించగానే నలువైపులా మట్టితో తయారైన ఏనుగులు, గుర్రాల విగ్రహాలు కనిపిస్తాయి. వాటికి ఎదురుగా అయ్యనార్ భటుడైన సెంబరుప్పు సన్నిధి ఉంది. ఆయనకు రూపం లేదు. గర్భాలయంలో ఈటె, కొడవలి వంటి ఆయుధాలు మాత్రమే ఉంటాయి. వాటిని నమస్కరించి వెళితే మహామండపంలో బలిపీఠం, మూడు ఏనుగుల శిల్పాలు కనిపిస్తాయి. వాటిని దాటుకుని వెళితే అర్ధ మండపంలో ద్వారపాలకులు, లోపల కుట్టి ఆండవర్ రూపరహితుడై దర్శనమిస్తారు. ఇక్క గర్భాలయంలో కుట్టి ఆండవర్ రూపరహితుడై ఉండటం వల్ల పూర్ణ, - పుష్కళ ఇద్దరూ కుట్టి ఆండవర్ సన్నిధికి కుడివైపున ప్రత్యేక సన్నిధిలో దర్శనమిస్తారు. అయ్యనార్ అన్ని చోట్లా పూర్ణ, పుష్కళతోనే దర్శనమిస్తారు. అయితే ఈ ఆలయంలో వారిద్దరూ ప్రత్యేక సన్నిధిలో దర్శనమివ్వటం విశేషం. ఈ ఆలయం చుట్టూ కుడివైపు వినాయకుడు, కాశియమ్మన్, కరుప్పసామి, రాహు-కేతువు, వినాయకుడు, పావాడరాయన్ మునీశ్వరన్, సంగిలివీరన్, అగ్నివీరన్ సన్నిధులున్నాయి. ఈ ఆలయం కడలితీరంలో ఉండటం వల్ల మత్స్యకారులంతా కుట్టి ఆండవర్‌ను తమ కులదైవంగా ఆరాధిస్తున్నారు. చేపలవేటకు వెళ్ళడానికి ముందు మత్స్యకారులు ఈ స్వామి దర్శనం చేసుకుని వెళతారు. దాని వలన చేపలు పుష్కలంగా లభిస్తాయని, వ్యాపారం కూడా అధికమవతుందని మత్స్యకారులు చెబుతుంటారు. ఈ ఆలయం చుట్టూ కావలి దైవాలుండటం వల్ల ఈ క్షేత్రం కులదైవారాధన ప్రతిరోజూ జరుగుతుంటాయి. ఈ ఆలయంలో ప్రతి పౌర్ణమిదినాన ఆలయ ప్రదక్షిణ కూడా జరుగుతుంది. ఆలయాన్ని ఐదుసార్లు ప్రదక్షిణ చేస్తే వివాహ ఆటంకాలు తొలగుతాయని, సంతానం కలుగుతుందని, రుణబాధలు పోతాయని గ్రామపెద్దలు చెబుతారు.



ఫల, పుష్ప, ఆయుధాల అలంకారంలో అయ్యనార్‌స్వామి

## ఎలా వెళ్ళాలి?

రాష్ట్రం నలుమూలల నుంచి చిదంబరానికి రాష్ట్ర రవాణా సంస్థ, ప్రైవేటు బస్సులు వెళుతుంటాయి. ఆ బస్సుల్లో చిదంబరం నగరానికి చేరుకుని అక్కడి నుండి పిచ్చావరానికి వెళ్లే బస్సెక్కి తెర్కు (దక్షిణ) పిచ్చావరంలో దిగాలి. అక్కడ సముద్రతీరానికి సమీపంలో చిట్టడవిలా పచ్చదనంతో కూడిన కుట్టి ఆండవర్ ఆలయం దర్శనమిస్తుంది. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5 నుండి రాత్రి 9 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

## తాటిచెట్టు ప్రయోజనాలను వివరించే 'పనై'



'పనై'లో హరీష్ ప్రభాకరన్, మేఘన

రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు ఎక్కువమంది ఉన్నప్పటికీ.. కల్లుగీతపై నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో తాటి చెట్టు ప్రయోజనాలను వివరిస్తూ 'పనై' పేరుతో ఒక చిత్రం రూపుదిద్దుకుంటుంది. ఎఎంఆర్ క్రియేషన్స్ పతాకంపై ఎం.రాజేంద్రన్ కథ సమకూర్చి సొంతంగా నిర్మించారు. హరీష్ ప్రభాకరన్ హీరోగా, మేఘనా హీరోయిన్‌గా నటించారు. ఇతర పాత్రల్లో సీనియర్ నటి వడివుక్కరసి, అనుపమ కుమార్, గంజా కరుప్పు, ఇమాన్ అన్నాచ్చి, టీఎస్ఆర్, రిషి జాకబ్ తదితరులు నటించారు. ఈ సినిమాకు ప్రముఖ గేయరచయిత వైరముత్తు సాహిత్యం అందించగా, మీరాలాల్ స్వరాలు సమకూర్చారు. స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం ఆది పి.ఆర్ముగం. ఈ సినిమా విశేషాలను వివరిస్తూ, 'తాటి చెట్టు డబ్బు సంపాదించి పెట్టే వృక్షం. దీనివల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఇది మన సంస్కృతిలోనే ఉంది. మనకోసం.. మనతో కలిసి పెరిగే చెట్టు. చేరన్ పరిపాలన చేసిన కాలం నుంచి సెల్‌ఫోన్ యుగం వరకు ఈ తాటిచెట్టు మహిమ గురించి ఇందులో చూపించాం. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసి, నిర్మాణాంతర కార్యక్రమాలను చేస్తున్నాం. త్వరలోనే ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేసి సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

## జూలై 14న ఇళయరాజా సంగీత విభావరి

ఇసైజ్ఞాని ఇళయరాజా సంగీత విభావరి జూలై 14వ తేదీ ఆదివారం నందనంలోని వైఎంసీఏ మైదానంలో భారీ ఎత్తున నిర్వహించనున్నారు. ఈ సంగీత కచ్చేరికి సంబంధించి పోస్టర్, టిక్కెట్‌ను బుధవారం చేశారు.. మెర్క్యురీ, అరుణ్ ఈవెంట్స్ సంస్థలు కలిసి ఈ లైవ్ కాన్సెర్ట్ నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన సంగీత విభావరి కార్యక్రమాలు జరగని రీతిలో గట్టి భద్రత, సకల సౌకర్యాలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ పోస్టర్ రిలీజ్ కార్యక్రమంలో నిర్వాహకుల్లో ఒకరైన అరుణ్ మీడియాతో మాట్లాడుతూ, 'తమిళ సినీ సంగీతానికి జీవనాడిగా ఉన్న ఇళయరాజాతో కలిసి ఈ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. ఈ విషయాన్ని మీడియా ద్వారా సగర్వంగా వెల్లడిస్తున్నాం. ఈ సంగీత విభారికి సంబంధించిన పోస్టర్లు, టిక్కెట్లను రిలీజ్ చేస్తున్నాం. సుమారుగా 50 వేల మంది పాల్గొంటారని భావిస్తున్నాం. గతంలో జరిగిన మ్యూజికల్ నైట్ కార్యక్రమాల సందర్భంగా ఏర్పడిన కొన్ని సంఘటనలను దృష్టిలో ఉంచుకుని గట్టి భద్రతా ఏర్పాట్లు చేశాం. ప్రేక్షకులు వచ్చివెళ్ళేందుకు వీలుగా మెట్రో రైల్, ర్యాపిడో, అద్దెకార్ల సర్వీసులతో అవగాహన కుదుర్చుకుని, ఈ సర్వీసులు కచ్చేరి ముగిసేంత వరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. టిక్కెట్లను పేటీఎం తదితర యాప్‌లో కూడా బుక్ చేసుకోవచ్చు. కనీస టిక్కెట్ ధర రూ.వెయ్యి, గరిష్ట ధర రూ.25 వేలు అని వివరించారు.

చిత్రజ్యోతి





టికెట్, పోస్టర్ రిలీజ్ దృశ్యం

## మూణ్ణాళ్ళ ముచ్చటగా సెలెబ్రిటీల ప్రేమ వివాహాలు



జీవీ ప్రకాష్ - సైంధవి

తమిళ చిత్రపరిశ్రమలో ప్రేమ వివాహాలు మూణ్ణాళ్ళ ముచ్చటగా మారిపోతున్నాయి. ఎన్నో సంవత్సరాలు పాటు ప్రేమించుకుని, ఒకరినొకరు అర్థం చేసుకుని మూడుముళ్ళ బంధంతో ఒక్కటైన ప్రేమ జంటలు ఒక్కొరుగా విడిపోతున్నారు. చిత్రపరిశ్రమలో ఆదర్శ దంపతులుగా గుర్తింపుపొందిన వారు సైతం తమ వైవాహిక బంధాన్ని తెగదెంపులు చేసుకుంటున్నారు. ఈ సెలెబ్రిటీల విడాకుల అంశం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. 2002లో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ధనుష్‌ను సూపర్‌స్టార్ రజనీకాంత్ పెద్ద కుమార్తె ఐశ్వర్యను 2004లో ప్రేమ వివాహం చేసుకున్నారు. దాదాపు 18 యేళ్ళు కలిసి జీవించారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నప్పటికీ వీరిద్దరూ విడిపోయారు. చట్టపరంగా విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. అదేవిధంగా తాను దర్శకత్వం వహించిన 'దైవతిరుమగన్', 'తలైవా' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన మలయాళ నటి అమలాపాల్‌ను డైరెక్టర్ ఏఎల్ విజయ్ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమ పెళ్ళి బంధం మూడేళ్ళకే ముగిసిపోయింది. తాజాగా ప్రముఖ సంగీత దర్శకుడు, సినీ హీరో జీవీ ప్రకాష్ కుమార్, గాయని సైంధవి దంపతులు విడిపోయారు. 11 యేళ్ళ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతున్నట్టు తాజాగా ప్రకటించారు. వీరికి ఒక కుమార్తె కూడా ఉంది. అయినప్పటికీ విడాకులకే మొగ్గుచూపారు. అదేవిధంగా కోలీవుడ్‌లో కమల్ హాసన్ - వాణి గణపతి, కమల్ హాసన్ - సారిక, శరత్ కుమార్ - సాయా, ప్రతాప్ మోహన్ - రాధికా, రఘువరన్ - రోహిణి, ప్రశాంత్ - గృహలక్ష్మి, పార్తిబన్ - సీత, రామరాజన్ - నళిని, అరవింద్ స్వామి - గాయత్రి, ప్రకాష్ రాజ్ - లలిత కుమారి, ప్రభుదేవా - రమలత, సెల్వరాఘవన్ - సోనియా అగర్వాల్, మనోజ్ కె. జైన్ - ఊర్వశి, సరిత - ముకేష్, రేవతి - సురేష్ మేనన్, గౌతమి - సందీప్ పాండ్యన్, సిద్ధార్థ్ - మేఘ్న, విష్ణు విశాల్ - రజనీ, ఇమాన్ - మోనికా ఇలా చెప్పుకుంటూపోతే విడిపోయిన సెలెబ్రిటీల జాబితా చాలా పెద్దదిగానే ఉంది.



ఏఎల్ విజయ్ - అమలాపాల్



ధనుష్ - ఐశ్వర్య

## యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా 'ఫ్యూరియోసా ఏ మ్యాడ్ మ్యాక్స్ సాగా'

2015లో వచ్చిన 'మ్యాడ్ మ్యాక్స్ ఫ్యూరి రోడ్' ఫ్రాంచైజీలో రానున్న చిత్రం 'ఫ్యూరియోసా ఏ మ్యాడ్ మ్యాక్స్ సాగా'. హాలీవుడ్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. 'మ్యాడ్ మ్యాక్స్' సిరీస్ చిత్రాల దర్శకుడు జార్జ్ మిల్లర్ డైరెక్ట్ చేశారు. గతంలో వచ్చిన చిత్రాలకంటే భిన్నంగా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. వార్నర్ బ్రదర్స్ సంస్థతో కలిసి మిల్లర్, ఆస్కార్ నామినేటెడ్ నిర్మాత డైగ్ మిథ్చల్, ఆస్ట్రేలియాకు చెందిన కెన్నడీ మిల్లర్ సంయుక్తంగా మిచ్చల్ పతాకంపై తెరకెక్కించారు. అన్యటైలర్ జాయ్ ఒక యువ మహిళా యోధురాలి పాత్ర పోషించగా, క్రిస్ హేమ్స్ వర్త్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఈ నెల 24న ప్రపంచ వ్యాప్తంగా తమిళం, తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో విడుదల చేస్తున్నారు. ఈ సినిమా గురించి క్రిస్ హేమ్స్ వర్త్ మాట్లాడుతూ, 'ఒక భారీ యాక్షన్ అడ్వెంచర్ హాలీవుడ్ మూవీలో ప్రతినాయకుడి పాత్ర పోషించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇలాంటి పాత్ర భవిష్యత్‌లో వస్తుందో రాదో తెలియదు. అలాంటి మంచి పాత్రలో నటించే అవకాశం ఇచ్చినందుకు దర్శక నిర్మాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



'ఫ్యూరియోసా ఏ మ్యాడ్ మ్యాక్స్ సాగా' ఓ దృశ్యం

## శ్రీరంగం ఆలయంలో కోలాహలంగా వసంతోత్సవం

ప్యారీస్, మే 16: తిరుచ్చి జిల్లాలో భూలోక వైకుంఠంగా విలసిల్లుతున్న శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో 9 రోజుల వసంతోత్సవాలు బుధవారం సాయంత్రం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులు వసంత మండపంలో చూర్ణాభిషేకం, రాత్రి 8 గంటల అనంతరం ఆర్యభట్ట ప్రవేశద్వారం వద్ద విశేషపూజలు నిర్వహిస్తారు. వసంతోత్సవం సందర్భంగా నంబెరుమాళ్ ఆలయ నాలుగో ప్రాకారమైన చక్రతాళ్వార్ సన్నిధి ఉత్తరం వైపున్న తోటలో ఏర్పాటుచేసిన వసంత మండపంలో స్వామివారు కొలువుదీరి భక్తులను కటాక్షిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు ఉభయదేవేరుల సమేతంగా మూలస్థానం నుంచి బయల్దేరే నంబెరుమాళ్ వసంత మండపానికి చేరుకుంటారు. అక్కడ అలంకారం, చూర్ణాభిషేకం పూజల అనంతరం రాత్రి 9 గంటలకు బయల్దేరి మూలస్థానం చేరుకుంటారు. చివరి రోజు నంబెరుమాళ్ బంగారు అశ్వ వాహనంపై విహరిస్తారు. ఈ సందర్భంగా తీర్థవారి, తిరుమంజనం సేవలను స్వామివారికి నిర్వహిస్తారు. వసంతోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ప్రత్యేక వసతులు కల్పించినట్లు ఆలయ జాయింట్ కమిషనర్ మారియప్పన్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో దేవేరుల సమేత రంగనాథస్వామి

## వృద్ధులకు బాసటగా 'బంధం'

- ఫోన్ చేస్తే క్షణాల్లో సాయం
- రోజురోజుకు పెరుగుతున్న స్పందన

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్, డీజీపీ శంకరజివాల్ సమష్టి కృషితో నగరంలోని 75 యేళ్లకు పైబడిన వృద్ధుల కోసం ఏర్పాటైన 'బంధం' పథకానికి అపూర్వ స్పందన లభిస్తోంది. 9499957575 అనే నెంబర్‌కు ఫోన్ చేస్తే చాలు సమీప ప్రాంతంలోని పోలీసుస్టేషన్ నుంచి ఎవరో ఒక కానిస్టేబుల్ గానీ, సిబ్బంది గాని ఫోన్ చేసిన వృద్ధుడి ఎదుట వెంటనే హాజరవుతారు. ఏం సాయం కావాలో అడుగుతారు. వృద్ధులు అడిగిన సాయాన్ని చేసి పోలీసులు శెభాష్ అనిపించుకుంటున్నారు. గత జనవరిలో డీజీపీ శంకర్‌జివాల్ ప్రారంభించిన ఈ 'బంధం' పోలీసులకు వృద్ధులకు మధ్య సన్నిహిత సంబంధాలను పెంచిందనడం అతిశయోక్తి కాదు. నగరంలో మారుమూల ప్రాంతంలో ఉన్న ఓ వృద్ధుడు బంధం ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి 'ఇంటిలో ఒంటరిగా నడవలేని పరిస్థితిలో ఉన్నాను. కాస్త ఆకుకూరలు తెచ్చిస్తే వండుకు తినగలను' అంటూ ఫోన్ చేశారు. వెంటనే సమీప ప్రాంతంలో ఉన్న పోలీసుస్టేషన్ నుంచి ఓ కానిస్టేబుల్ ఆ వృద్ధుడి దగ్గరకు వెళ్ళి ఆయన చెప్పిన ఆకుకూరలు మార్కెట్ నుంచి తెచ్చివ్వడంతో. ఆ వృద్ధుడి సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది. ఇప్పటివరకూ ఈ బంధం ఫోన్ నెంబర్ ద్వారా వందల సంఖ్యలో వృద్ధులు లబ్ధిపొందారు. ఇళ్ళలో ఒంటరిగా ఉన్న వృద్ధులు బోర్ కొడుతోందని చెబితే అతడిని కానిస్టేబుల్ ఒకరు పరామర్శించి చక్కటి కబుర్లు కూడా చెప్పారు. బుధవారం నగరం నలుమూలల నుంచి ఒకే సమయంలో పది పదిహేను కాల్స్ వచ్చాయి. కాల్‌చేసిన పావుగంటకల్లా ఆయా వృద్ధుల దగ్గరకు కానిస్టేబుళ్లు, సిబ్బంది వెళ్ళి సాయమందించారు. ఈ బంధం స్కీమ్ ద్వారా ఎంతో మంది వృద్ధులు లబ్ధి పొందుతున్నారని నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ తెలిపారు. మధుమేహం, బీపీ వంటి రోగాలతో బాధపడుతున్న వృద్ధులకు సకాలంలో మందులు కూడా ఇస్తున్నామని, అవసరమయితే నగరానికి చెందిన పలువురు వైద్యుల ద్వారా ఉచిత వైద్య సలహాలను కూడా ఫోన్ ద్వారా అందజేస్తున్నామన్నారు. మొత్తానికి నగరంలోని వృద్ధులతో పోలీసు 'బంధం' రోజురోజుకూ పటిష్టమవుతోందని ఆయన నవ్వుతూ తెలిపారు.





'బంధం' ప్రారంభోత్సవంలో డీజీపీ శంకర్‌జివాల్, పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్



చెన్నై క్యాంప్ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సతీసమేతంగా కలుసుకొని జన్మదిన శుభాకాంక్షలు అందుకుంటున్న రాష్ట్ర సంగీత, సాహిత్య, నాటక మండలి అధ్యక్షుడు వాగై చంద్రశేఖర్

## న్యూరాలజీ విభాగానికి జీహెచ్‌లో రూ.65 కోట్లతో భవనం

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీహెచ్) ప్రాంగణంలో రూ.65 కోట్లతో న్యూరాలజీ విభాగానికి కొత్త భవన సముదాయం నిర్మిస్తున్నారు. ప్రజాపనుల శాఖ ఈ భవన నిర్మాణ పనులు చేపడుతోంది. ఈ భవన సముదాయం నాలుగు అంతస్తుల్లో 220 పడకల సదుపాయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమవుతోంది. ఈ భవన సముదాయంలోని దిగువ అంతస్తులో ఔట్ పేషంట్ విభాగం, శస్త్రచికిత్సా రోగుల విభాగం ఉంటుంది. మొదటి, రెండో అంతస్తులను మహిళల వార్డు, పురుషుల వార్డులకు ఉపయోగించనున్నారు. మూడో అంతస్తులో అత్యవసర చికిత్సా విభాగం ఏర్పాటు చేయనున్నారు. నాలుగో అంతస్తులో ఆరు ఆపరేషన్ థియేటర్లుంటాయని అధికారులు తెలిపారు.



భవనసముదాయం నమూనా

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం టీపీ సత్రం వద్ద జాతీయ డెంగ్యూ దినం సందర్భంగా నిర్వహించిన అవగాహన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

